క్లుప్తంగా

15న పోలమాంబకు సామూహిక కుంకుమ పూజలు


శంబరపోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడిలో ఈనెల 15వతేదీన శుక్రవారం సామూహిక ఉచిత కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా చదురుగుడిలో 15వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటలకు వేదపండితులు కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుంకుమపూజకు హాజరయ్యే భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, తదితర పూజాసామగ్రి దేవస్థానం తరఫున అందించనున్నట్లు ఈవో తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


నర్సిపురంలో రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖాధికారి అశోక్, తహసీల్దార్ వై.సురేష్

పార్వతీపురం రూరల్: మండల వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారుల సమన్వయంతో మండల పరిధిలో ఉన్న నాలుగు ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, దస్త్రాలు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ అమ్మకాల పత్రాల నిర్వహణపై ఆరాతీశారు. అధిక ధరలకు విక్రయించరాదని దుకాణదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏఓ అశోక్ మాట్లాడుతూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుత్ కోతలు లేవు


సింహాచలం

బలిజిపేట: మండలంలో అధికారిక, అనధికారిక విద్యుత్ కోతలు లేవని విద్యుత్‌శాఖ ఏఈ సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల కాలంలో కొత్త విద్యుత్ లైన్లు వేయడం, వాతావరణ ప్రభావం వలన, విద్యుత్ తీగలకు తగులుతూ ఉండే చెట్లు నరికివేత, బ్రేక్‌డౌన్ల సమయాల్లో మాత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

ఎంఆర్‌పీకే మద్యం విక్రయించాలి


బలిజిపేటలోని ప్రైవేట్ షాపులో తనిఖీ చేస్తున్న పద్మావతి

బలిజిపేట: మద్యాన్ని షాపుల్లో ఎంఆర్‌పీకే విక్రయించాలని సీతానగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో ప్రైవేట్ మద్యం షాపులను మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. షాపు యజమానులు చట్టంలో గల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా గొలుసు దుకాణాలు ఉన్నట్లు గుర్తిస్తే ఈ విషయాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14405కు కానీ అధికారుల నంబర్లు 9440902373, 9491484679కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. మద్యం దుకాణాల్లో రికార్డులు పరిశీలించి స్టాకును లెక్కించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా నాటు తుపాకులు అప్పగించాలి

- రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి


ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండల పరిధిలో నాటు తుపాకులు కలిగి ఉన్నవారు తక్షణమే రూరల్ పోలీసు స్టేషన్‌కు స్వచ్ఛందంగా అప్పగించాలని పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి కోరారు. నాటు తుపాకులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా అప్పగిస్తే కేసులుండవని ఈ మేరకు ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్‌లో భాగంగా మండలంలోని రావికోన పంచాయతీ కొత్తవలస గ్రామంలో ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఈ క్రమంలో సమీప గ్రామాల్లో ఎవరైనా నాటు తుపాకులను కలిగి ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని ఎస్సై కోరారు.

రహదారులున్నా.. తిరగని బస్సులు..!

- గతంలో రాకపోకలు సాగించిన ఆర్టీసీ బస్సుల నిలిపివేత
- ప్రయాణికులకు ఆటోలే దిక్కు
- రాత్రివేళ గమ్యం చేరుకునేందుకు గ్రామీణుల అవస్థలు



కోన, తూరుమామిడి గ్రామాలకు బస్సులు లేక, ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రజలు, (ఇన్‌సెట్లో) మక్కువ నుండి కోన గ్రామానికిసక్రమంగా ఉన్న రహదారి

మక్కువ: మండలంలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యమున్నా, ఆర్టీసీ బస్సులను ఆయా రూట్‌లలో ఏర్పాటుచేయక పోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గతంలో మండలంలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుండేవి. కలెక్షన్లు తక్కువగా వస్తున్నాయన్న, నెపంతో బస్సులను నిలిపివేశారు. దీంతో రాత్రివేళ ప్రైవేట్ వాహనాల సదుపాయం లేకపోవడంతో, ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కోన, గోపాలపురం, తూరుమామిడి గ్రామాలకు, అలాగే కాశీపట్నం, కొండరేజేరు గ్రామాలకు ఆర్టీసీబస్సులు గతంలో నడిపేవారు. కొన్నేళ్లుగా ఆ బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. అలాగే సాలూరు నుంచి మక్కువ, మార్కొండపుట్టి, గైశీల గ్రామాలమీదుగా నంద గ్రామానికి బస్సు నడిచేది. కొంతకాలంగా ఆ రూట్‌లో బస్సు తిప్పకపోవడంతో సుమారు పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి



మక్కువ నుంచి కోన, గోపాలపురం గ్రామాలమీదుగా తూరుమామిడి గ్రామానికి ఆర్టీసీబస్సు నడిచేది. కొంతకాలంగా ఆర్టీసీబస్సును నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. వృద్ధులు, విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామం నుంచి సుమారు 5కిలోమీటర్ల దూరం మక్కువకు ఆటోలలో, తప్పనిసరి పరిస్థితిలో కాలినడకన నడిచి వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరించాలి.

– ఒమ్మి రామారావు, ప్రయాణికుడు, తూరుమామిడి గ్రామం, మక్కువ మండలం

సమాజాన్ని మార్గనిర్దేశం చేసేది యువతే

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: సమాజాన్ని మంచి మార్గంలో నడిచేలా మార్గనిర్దేశం చేసేది యువత మాత్రమేనని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు లయన్స్ క్లబ్, ఎన్‌సీసీ, ఎయిడ్స్ నియంత్రణ, కళాశాల యాజమాన్యం సారథ్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం కొత్తవలసలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో బాగా చదివే విద్యార్థులు ఉన్నారని, అందుకే పదోతరగతి, ఇంటర్, డిగ్రీల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని కితాబిచ్చారు. నేర్చుకున్న విద్యతో క్రమశిక్షణ, విద్యాప్రమాణాలు, నైపుణ్యం పెరగాలని ఆకాంక్షించారు. అంతే కానీ విలాసాలకు అలవాటు పడి యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యా బుద్ధులతో డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు యువత అంబాసిడర్లు కావాలని పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహానుభావులు నమ్ముకున్న సిద్ధాంతం, సమాజం కోసం పనిచేశారని గుర్తుచేశారు. అదేవిధంగా ప్రస్తుతం డిగ్రీ చదివే విద్యార్థులందరూ, యువత పెడదోవ పట్టకుండా సన్మార్గంలో నడిచేలా సమాజానికి దిశానిర్దేశం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలను నివారించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఇందులో యువత కూడా భాగస్వామ్యమై డ్రగ్స్‌ను, ఎయిడ్స్‌ను నివారించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై పోస్టర్లను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. టి.జగన్‌మోహనరావు, జానపద కళాకారుడు దామోదర గణపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతిరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.సీతారామ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకులు సామాజిక తనిఖీలకు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న ఏపీఓ బాలకృష్ణ

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, మెటీరియల్ కాంపొనెంట్ పనులపై సామాజిక తనిఖీలు చేయడానికి సిబ్బంది అవగాహన కల్పించుకోవాలని ఇంజినీరింగ్ అధికారి సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏపీఓ బాలకృష్ణ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, క్షేత్ర సహాయకులతో సామాజిక తనిఖీల నిర్వహణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–24 ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ నిధులు ఖర్చు చేసిన పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నామని, నిర్దేశించిన సమయానికి రికార్డులు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి

- డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా చేసిన ప్రణాళికల మేరకు రుణాలను మంజూరు చేయాలని చెప్పారు.

సభ్యురాలికి రూ.లక్ష చొప్పున మంజూరు చేసి వ్యాపార వేత్తలుగా చేయాలని, ముఖ్యంగా ఎంసీపీ ఆన్‌లైన్ ద్వారా రుణాలు మంజూరు చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ మేరకు అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో రుణాలు మంజూరు చేసేలా ప్రణాళికలు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎన్.విజయ స్వరూప్, బ్యాంక్ కంట్రోలర్స్, డీపీఎంలు, బ్యాంక్ మేనేజర్లు,ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొనుగోలుచేస్తే బిల్లులు ఇవ్వాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భరత్‌కుమార్

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని ఎరువుల దుకాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ భరత్‌కుమార్, ఏవో భారతిలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వలు, ఈపోస్ మిషన్లు, స్టాక్ బుక్‌లు, బిల్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భరత్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు దుకాణం వద్ద స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్‌బోర్డులో ఏయే ఎరువులు అందుబాటులో ఉన్నాయో పొందుపరచాలని చెప్పారు. కొనుగోలుచేసిన ఎరువులకు తప్పనిసరిగా రైతులకు బిల్లులు అందించాలని స్పష్టం చేశారు. రైతులకు విక్రయిస్తున్న ఎరువులతో పాటు, లింక్ ప్రొడక్ట్‌సను అంటగట్టరాదన్నారు. ఎంఆర్‌పీకంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పదని ఎరువుల డీలర్లను హెచ్చరించారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్‌సెర్చ్

- రెండు నాటుతుపాకుల స్వాధీనం?

సాలూరు: గిరిజన గ్రామాల్లో నాటుతుపాకుల కోసం పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలోని కొత్తవలస మండలంలో నాటు తుపాకీతో ఓ వ్యక్తి హత్యకు పాల్పడిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై నాటుతుపాకులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో అధికారులు జల్లెడ పడుతున్నారు.గిరిజన గ్రామాల్లో పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో తోణాం పంచాయతీ దిగువమెండంగిలో రెండు నాటుతుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రాణరక్షణ, వేటకోసం నాటుతుపాకులు

అనాదిగా పలు గిరిజన గ్రామాల్లో అక్కడక్కడ నాటుతుపాకులు ఉన్నాయనేది బహిరంగ రహస్యమే. అయితే వారు ముఖ్యంగా వేటకోసమే వాటిని వినియోగిస్తుంటారని తెలుస్తోంది. అడవుల సమీపంలో ఉండే వారు క్రూర మృగాల నుంచి రక్షణకు కూడా పలువురు గిరిజనులు దాచుకుంటున్నారు.

గంజాయి, సారా వ్యాపారస్తుల వద్ద నాటుతుపాకులు?

ఆంధ్రా, ఒడిశాల మధ్య గంజాయి, సారా రవాణా విస్తృతంగా జరుగుతుంది. అయితే ఈ రవాణాల్లో కొందరు ఒడిశా వ్యాపారస్తులు నాటుతుపాకులను వినియోగిస్తున్నట్లు తెలియవస్తోంది. దీనిని గతంలో పోలీసులు ధ్రువీకరించిన సంఘటనలు ఉన్నాయి. కాగా ఆంధ్రాకు కూతవేటు దూరంలో ఒడిశాలో ఇటీవల నాటుతుపాకీతో పాటు పలు మారణాయుధాల తయారీ ముడిసరుకులను పోలీసులు గుర్తించిన సంఘటన పాఠకులకు విదితమే.



ఇది పాఠశాల అంటారా?

- ఎన్నికల ప్రచారంలో మంత్రి సంధ్యారాణి పలుకులు
- ఇప్పటికీ అదే స్థితిలో ఉన్న పాఠశాల


షెడ్డులో నిర్వహిస్తున్న గంగన్నదొర వలస పాఠశాల

సాలూరు రూరల్: పాఠశాలల అభివృద్ధి జగనన్న పాలనలో జరిగిందన్న నిజం ఏ విద్యార్థి తల్లిదండ్రులను అడిగినా ఠక్కున చెబుతారు. అలాంటిది గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి సాలూరు మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో చేసిన ఎన్నికల ప్రచారం సందర్భంగా కొన్ని గ్రామాల పాఠశాలలను సందర్శించారు. అందులో నిమ్మలపాడు పాఠశాల ఒకటి. అయితే అప్పట్లో పాఠశాలను చూపిస్తూ దీన్ని పాఠశాల అంటారా? అంటూ జగన్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంతవరకు గిరిజన గ్రామాల్లో పాకల్లో ఉన్న పాఠశాలలు మంత్రికి గుర్తుకురాకపోవడం ఆమె గతంలో చేసిన ఆరోపణలు ఆమెకే చెందుతాయా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తోణాం పంచాయతీలోని మెట్టవలస పాఠశాలను ఆ గ్రామస్తులు చందాలు ఎత్తుకుని నిర్మించుకున్నారు.అలాగే ఇటీవల గంగన్నదొర వలస పాఠశాల నిర్మాణం పూర్తిచేయాలని మంత్రి సంధ్యారాణికి విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పుడు మండలంలో పాకల్లో నిర్వహిస్తున్న పాఠశాలలకు ఎప్పుడు నిర్మాణ పనులు చేపడతారో చెప్పగలరా? అని ఆయా గ్రామాల పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయండి


కుడుమూరు సమీపంలో మెట్టవలస వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు

పాచిపెంట: మండలంలోని కుడుమూరు గ్రామంలో గల 48 సర్వేనంబర్‌లో గిరిజనులు సాగు చేస్తున్న 782 ఎకరాల ప్రభుత్వ భూములకు వెంటనే సాగు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన రైతులు కుడుమూరు సమీపంలో మెట్టవలస వద్ద మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి అధికారులు కాలయాపన చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయగా నెల రోజుల్లో సమస్య పరిష్కరించి పట్టాలు మంజూరు చేస్తామని చెప్పి రెండు నెలలైనప్పటికీ నేటికీ పట్టించుకోలేదన్నారు ఈ నెల 15వ తేదీన సాగు భూములకు పట్టాలు మంజూరు చేస్తామని కలెక్టర్, స్థానిక మంత్రి తెలియజేశారని, వాటితో పాటు తాము సాగు చేస్తున్న భూములకు కూడా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జన్ని రామయ్య, సూకురు అప్పలస్వామి, గిన్నెల గోపాలు, గిన్నెల పోతి నాయుడు, భీమయ్య,కొర్ర కల్యాణ్, కొర్ర శ్రీనివాసరావు మాదల జమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

బయోగ్రామాలు బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సాలూరు: ప్రకృతి వ్యవసాయ బయోగ్రామాలను బలోపేతం చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రవణ్‌కుమార్‌నాయుడు అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వ్యవసాయ డివిజనల్ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీతి ఆయోగ్ మన్యం జిల్లాను ప్రకృతి వ్యవసాయ ఆశాజనక జిల్లాగా ఎంపిక చేసిందని చెప్పారు. ప్రతి ప్రకృతి వ్యవసాయ కార్యకర్త, రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగులో ప్రకృతికి హానిచేసే విధమైన విషపదార్థాలు రైతులు ఉపయోగించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. సహజ పంటలు పండించుకుని అందరి ఆరోగ్యం కాపాడాలని సూచించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో కొన్ని గిరిజన గ్రామాలను మోడల్ బయో గ్రామాలుగా ఎంపికచేశామని వాటిని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ పారినాయుడు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలిపోయిన విద్యుత్ స్తంభాలు


వాలిపోయి వైర్ల ఆధారం మీద నిలబడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

సాలూరు: పొలాల్లో వాలిపోయి పడిపోవడానికి సిద్ధంగా కరెంట్ స్తంభాలు ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలో రైల్వేస్టేషన్‌రోడ్డు సమీపంలో పొలాల్లో విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. వైర్ల ఆధారం మీదనే అవి నిలబడ్డాయి. ఈ స్తంభాలు ప్రమాదకరంగా మారడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన అధికమవుతోంది. ప్రజలు ప్రాణాలు పోతే గానీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోరా? అంటూ తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ స్తంభాలను సరిచేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కలహాలతో వ్యక్తిపై దాడి


బాధితుడితో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: మండలంలోని నిస్సంకపురం గ్రామంలో ఒకే కుటుంబంలో ఇంటి దైవం విషయంలో తగాదాపడి మద్యం మత్తులో ఓ వ్యక్తి గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దీనిపై పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బర్ల వెంకటరమణ ఈ ఏడాదిలో నూతన గృహాన్ని నిర్మించుకుని తమ ఇంటి దైవాన్ని నూతన గృహంలో పెట్టగా అదే కుటుంబానికి చెందిన బర్ల లక్ష్మణరావు ఇంటి దైవానికి మొక్కుకునేందుకు ఇటీవల వెళ్లగా రావద్దని వెంకటరమణ వారించాడు. అప్పటి నుంచి ప్రతిరోజూ రాత్రివేళ వెంకటరమణ మద్యం తాగి లక్ష్మణరావును దూషిస్తూ సోమవారం రాత్రి చిన్న గొడ్డలితో దాడి చేయడంతో లక్ష్మణరావు చేతిపై గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితుడు 100కు ఫోన్ చేసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


బలిజిపేట ఉన్నత పాఠశాలలో మాత్రలు వేస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అన్ని పాఠశాలల్లో పంపిణీ చేశారు. నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-1సామల సింహాచలం, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధురిల ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలను విద్యార్థులచేత మింగించారు. కార్యక్రమంలో బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు

పార్వతీపురం రూరల్: నులిపురుగుల నివారణకు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం తప్పనిసరి అని డీఐఓ డా.విజయమోహన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డీవార్మింగ్‌డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. అలాగే నర్సిపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్థానిక వైద్యసిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

పాచిపెంట: ఎరువుల దుకాణాల డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్, ఏఓ తిరుపతిరావులు హెచ్చరించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, విక్రయించే ఎరువులకు బిల్లులను సదరు కొనుగోలుదారులైన రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. డిపో వద్ద ఎరువుల ధరలతో పాటు లైసెన్స్‌లను ప్రదర్శించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక


జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

పార్వతీపురంటౌన్: శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పలు క్రీడాంశాల్లో జిల్లా క్రీడారులకు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా క్రీడా ప్రాధికార అధికారి కె. శ్రీధరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో మంగళవారం అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర అంశాల్లో క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపికలో సుమారు 240 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎంపికైన క్రీడాకారులను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటాలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంస్థ శిక్షకులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మురళీకృష్ణ, పీఈటీలు, పీడీలు, అధ్యాపకులు ఎం.వాసుదేవరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.